ప్రజాశక్తి

శుక్రవారం 3 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం   అనకాపల్లి





పారిశ్రామిక సదస్సుకు సిద్ధం

- నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి
- సర్వాంగ సుందరంగా సభా ప్రాంగణం
- పోలీస్ వలయంలో ఎయు మైదానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

సుమారు రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు, పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3, 4 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ సర్వం సిద్ధమైంది. ఇప్పటికే సమ్మిట్ జరిగే ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామిక వేత్తలు తరలిరానుండటంతో ఎయు ప్రాంగణమంతా పోలీసు వలయంలోకి వెళ్లిపోయింది.


ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వైపు పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. కనీసం రెండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల లక్ష్యంతో మొదలుపెట్టి గౌరవప్రదమైన సంఖ్యతో ముగించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం జగన్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి కొద్ది రోజుల క్రితమే ఢిల్లీలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న వనరులను తెలియజేశారు. విశాఖ నగరానికి ఉన్న ప్రత్యేకతలను వారికి కళ్ళకు కట్టినట్టు చూపించారు. భావితరాలకు విశాఖ భవిష్యత్తు అన్న సంకేతమిచ్చారు. మరో మిగతా 2లో..



సమ్మిట్ వేదిక



సమ్మిట్ థీమ్ ఆకృతి



సిఎంకు స్వాగతం పలికిన మంత్రులు బూడి, అమర్‌నాథ్



నిరసన తెలుపుతున్న సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు

గ్యాస్ ధర పెంపుపై నిరసనలు

మోడీ సర్కారుపై సిపిఎం నేతల ఆగ్రహం

వార్తలు లోపలి పేజీల్లో

సమ్మిట్ పేరుతో భూములు కట్టబెట్టొద్దు

సిఐటియు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టవద్దని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో- ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. గురువారం వారు ఓ సంయుక్త మిగతా 2లో..

ఎస్‌బిసి బ్రిడ్జిపై వాహనాలు అనుమతించాలి


వార్త 4లో..

'ఉక్కు' పరిరక్షణతో యువతకు ఉద్యోగావకాశాలు

వార్త 2లో..

ఎన్నికల కోడ్ అమలేదీ ?

వార్త 8లో..



పాడేరులో ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు

ఏజెన్సీలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విస్తృత ప్రచారం

వార్త 8లో..

ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ భేష్

- ఫిబ్రవరిలో మెరుగైన ఫలితాలు
- రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో 4,20,100 టన్నుల ఉత్పత్తి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికుల, ఉద్యోగుల సమిష్టి కృషితో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ 2023 ప్రారంభంలోనే స్టీల్ ఉత్పాదికతలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించింది. రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి సాధించింది. రెండు బ్లాస్ట్ ఫర్నేసులు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకూ ఫిబ్రవరిలో అత్యుత్తమ స్టీల్ ఉత్పత్తి ఇదేనని యాజమాన్యం వెల్లడించింది. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో కలిపి 4,20,100 టన్నులు ఉత్పత్తి సాధించగా బిఎఫ్ -1 నుంచి 2.12 లక్షల టన్నులు, బిఎఫ్-2 నుంచి 2.8 లక్షల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి సాధించింది. ఫిబ్రవరిలో డబ్ల్యుఆర్ఎం (వైర్ రాడ్ మిల్) నుంచి 91,356 టన్నుల వైర్ ఉత్పత్తి జరిగింది. ఎస్‌బిఎం నుంచి 53,453 టన్నులు, డబ్ల్యుఆర్ ఎం-2 నుంచి 56,72 టన్నుల రాడ్లు ఉత్పత్తి అయ్యాయి. స్ట్రక్చరల్ మిల్ నుంచి 48,853 టన్నుల స్ట్రక్చరల్ ఉత్పత్తి జరిగింది.



కర్మాగారం ప్రారంభం నుంచి ఫిబ్రవరి నెలలో సాధించిన అత్యుత్తమ ప్రదర్శన ఇది. అలాగే విస్తరణ జరిగిన కొత్త యూనిట్ల నుంచి 1,59,028 టన్నుల ఫినిష్డ్ స్టీల్, అన్ని విభాగాల నుంచి 3,77,489 టన్నుల ఉత్పత్తి సాధించింది. కార్మికుల సమిష్టి కృషి ద్వారా విశాఖ ఉక్కు కర్మాగారం అత్యుత్తమ పనితీరు ప్రదర్శించినందుకు సిఎమ్‌డి అతుల్ భట్ కార్మికులను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి అత్యుత్తమ ప్రదర్శన కొనసాగించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. మిగతా 2లో..



నినాదాలు చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

'ఉక్కు' పరిరక్షణతో యువతకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

3.5 లక్షల కోట్ల ఆస్తులున్న విశాఖ ఉక్కు కర్మాగారంలో పూర్తిస్థాయి ఉత్పత్తిని కొనసాగిస్తే తక్షణం ఆరు వేల ఉద్యోగాలు నిరుద్యోగులకు లభిస్తాయని, మరో 10 మిలియన్ టన్నుల విస్తరణ చేయగలిగితే పది వేల మందికి ఉపాధి దొరుకుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 348వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్ కుమార్, బి.అప్పారావు, పివి.రమణమూర్తి మాట్లాడారు. బిజెపి వంచనకు గురైన విశాఖ ఉక్కును కాపాడాల్సిందిపోయి కొత్త పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంపర్లాడటాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కుట్రకు మూడున్నర లక్షల కోట్లు ఆవిరైపోతుంటే, రెండు లక్షల కోట్లు విదేశీ పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంపర్లాడడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్లాంట్ నష్టాలకు వక్రభాష్యం చెబుతున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రకటనలను ఖండించాలన్నారు. దీక్షల్లో నాయకులు డి.శ్రీనివాస్, జి.నరేంద్ర, కోటేశ్వరరావు, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీతారాం తదితరులు

బాలల వాదనలు జాతీయ స్థాయిలో వినిపిద్దాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల వాదనలను జాతీయ స్థాయిలో వినిపించేందుకు కృషి చేద్దామని ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎఐసిఆర్‌పిఎఫ్) జాతీయ సలహాదారు వివి.లక్ష్మీనారాయణ అన్నారు. ఇటీవల ఆయన ఫోరానికి జాతీయ సలహాదారుగా ఎన్నికైన నేపథ్యంలో ఫోరం సౌత్ జోన్ రాష్ట్రాల కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం సారథ్యంలో పలువురు ప్రతినిధులు గురువారం ఎంవిపి.కాలనీలో లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ జనాభాలో పిల్లల శాతం ఎక్కువగానే ఉందన్నారు. నిత్యం వారు ఎన్నో సమస్యలు ఎదుర్కోవడమే కాకుండా వారి హక్కులను సైతం కోల్పోతుండడం విచారకరమని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం విశాఖ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ డాక్టర్ బి.లవకుశ పాల్గొన్నారు.

ఎయు విసిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అర్హత లేకపోయినా ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతూ తన వృత్తి బాధ్యతలను విస్మరించి చట్ట విరుద్ధమైనటువంటి కార్యకలాపాలలో అదేపనిగా పాల్గొంటున్న ప్రసాద రెడ్డిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన విచారణ జరిపించాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రోగ్రెసివ్ ఫోరం కన్వీనర్ డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విసి హోదాలో రెడ్డి కుల సంఘాల సమావేశాలకు హాజరవడం, విజయసాయి రెడ్డి లాంటి అనేక మంది బర్త్ డేలకు తన ఛాంబర్‌లోనే కేక్‌లు కట్ చేయడం వంటి అనేక చర్యలకు విసి పాల్పడ్డారన్నారు. ఆయన చర్యలను ఈ ప్రాంత మేధావులు, ప్రముఖులు, పలు విద్యార్థి, యువజన, ప్రగతిశీల సంఘాలు ఖండిస్తూనే ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ఓ హోటల్‌లో అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా సమావేశం నిర్వహించి అడ్డంగా దొరికేసినా ఆర్‌డిఒతో విచారణ జరిపి మమ అనిపించటం విచారకరమన్నారు.

మొదటి పేజీ తరువాయి..

పారిశ్రామిక సదస్సుకు సిద్ధం

పక్క మంత్రి అమర్‌నాథ్ ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలలో రోడ్‌షోలు నిర్వహించారు. పరిశ్రమలకు ఏయే ప్రాంతాలు అనువైనవో తెలియజెప్పి వారందరినీ రాష్ట్రానికి ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టడానికి మెరుగైన అవకాశాలు ఉన్న 14 రంగాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పారిశ్రామిక దిగ్గజాలైన ముకేశ్ అంబానీ, కరణ్ అదానీ, కుమార మంగళం బిర్లా, గ్రంధి మల్లికార్జున రావు తదితరులు సదస్సుకు తరలివస్తున్నారు.

ఈ సదస్సు జరిగే రెండు రోజులూ వివిధ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయులు కుదుర్చుకోనుంది. ఇదిలా ఉండగా ఈ సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రానికే విశాఖ నగరానికి చేరుకున్నారు. ఆయన సమ్మిట్ ముగిసే వరకూ ఇక్కడే ఉండనున్నారు.

ఏర్పాట్లు ఇలా..

ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. మిరమిట్లు గొలిపే సభా వేదికపై సుమారు 30 మంది అతిథులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదిక వద్ద నాలుగు వేల మంది ప్రతినిధులు కూర్చునేందుకు అవకాశం కల్పించారు. సభ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో పనిచేస్తున్న పరిశ్రమలు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్న ప్రాంతాలు, అక్కడ మౌలిక సదుపాయాలను అతిథులకు తెలియజేసే విధంగా ఒక ఆడియో విజువల్ షోను ప్రదర్శించనున్నారు. ఈ సభా ప్రాంగణాన్ని పక్కనే ఉన్న మరో గదిలో బ్రేకౌట్ సెషన్స్ నిర్వహించనున్నారు. దాని పక్కనే మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో సిఎం ఆఫీసును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దీనికి అనుకుని మంత్రుల డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. దాని పక్కనే మీడియా ప్రతినిధులకు డైనింగ్ సౌకర్యం కల్పించారు.

సభా ప్రాంగణంలో అత్యంత ఆకర్షణీయంగా ఎపి పెవిలియన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీని చుట్టూ వివిధ కంపెనీలకు చెందిన స్టాల్స్ ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ కార్యాలయ నమూనా కూడా ఇక్కడ అందరినీ ఆకట్టుకోనుంది. లేపాక్షి హస్త కళా ప్రదర్శన స్టాల్ అందరినీ కట్టిపడేసే విధంగా ఉంది. కర్ణాటక సంప్రదాయ రీతులలో ఉన్న వివిధ ఆకృతులను స్టాల్స్ మధ్యలో ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

విఐపిలు, వివిఐపిలు ఈ సభకు తరలివస్తున్న నేపథ్యంలో పోలీసులు నగరమంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. సభా ప్రదేశాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సిసి కెమెరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. అలాగే డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు.

సిఎంకు ఘన స్వాగతం

సమ్మిట్‌లో పాల్గొనేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5:15 నిమిషాలకు విశాఖపట్నం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, విజయసాయిరెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరిన సిఎం కాన్వాయ్‌కు తాటిచెట్లపాలెం వద్ద వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది అనంతరం సిఎం తాను బస చేసే రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 8:50కి బయలుదేరి 9:10కి సమ్మిట్ వేదిక వద్దకు చేరుకోనున్నారు.

సమ్మిట్ పేరుతో భూములు కట్టబెట్టొద్దు

ప్రకటనను విడుదల చేశారు. ఈ సమ్మిట్‌కి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇప్పటికే విశాఖపట్నాన్ని విద్యుత్ కాంతులతో, రంగురంగులతో ముస్తాబు చేశారన్నారు. నిజంగా పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషించదగ్గ విషయమేనన్నారు. అయితే గత ప్రభుత్వాలు ఇటువంటి సమ్మిట్లు అనేకం నిర్వహించి వందల, వేలాది కోట్ల రూపాయలను ఖర్చు చేశాయన్నారు. అయినప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, నిరుద్యోగులకు ఉపాధి దొరకలేదని తెలిపారు. వాస్తవంగా విశాఖపట్నం పారిశ్రామికంగా 40 సంవత్సరాల క్రితమే అభివృద్ధి చెందిందన్నారు. విశాఖపట్నం పోర్టు, హిందూస్థాన్ షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, బిహెచ్ఇఎల్, స్టీల్‌ప్లాంట్, హిందూస్థాన్ జింక్, ఎన్‌టిపిసి, రక్షణ రంగం, ఎల్ఐసి, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, డిసిఐ మొదలగు ప్రభుత్వరంగ పరిశ్రమలు వచ్చాయన్నారు. ప్రైవేటు రంగంలో కోరమండల్, ఎస్ఆర్, ఆటోనగర్, విశాఖ డెయిరీ, ఇండ్రస్టియల్ ఎస్టేట్ వచ్చాయన్నారు. ఈ పరిశ్రమలలో సుమారు రెండు లక్షలు మంది పర్మినెంట్, లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తుండేవారన్నారు. గత ప్రభుత్వ కాలంలోనూ, ప్రస్తుత ప్రభుత్వకాలంలోనూ ఒక్క ప్రభుత్వరంగ పరిశ్రమ రాలేదు సరికదా ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమల మీద నేటి పాలకులు ప్రైవేటీకరణ దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులను తగ్గిస్తున్నారని చెప్పారు. కొత్త ఉదోగావకాశాలు అస్సలు కల్పించడం లేదన్నారు. ఆటోనగర్‌లో 20 శాతం పరిశ్రమలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. ఉన్న పరిశ్రమలను రక్షించుకుండా, వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా ఈనాటి ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. 750 రోజుల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంటే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీ ఉద్యమానికి మద్దతు అంటున్నాయి తప్ప కేంద్రం దగ్గరకు వెళ్లేటప్పటికి మాట రానివిగా ఉంటూ దోబూచులు ఆడుతున్నాయన్నారు. విశాఖపట్నం అభివృద్ధి జరగాలంటే ఉన్న పరిశ్రమలను రక్షించుకోవాలన్నారు.

సమ్మిట్ ముసుగులో వైసిపి నాయకుల వ్యాపారాలు

కలెక్టరేట్ : విశాఖలో సమ్మిట్ షో పేరుతో వైసిపి నాయకులు వ్యాపారాలు చేస్తున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొండ్రు మురళితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నుంచి పరిశ్రమలు తేలేని సిఎం జగన్ ఇప్పుడు అత్యుత్సాహంగా సమ్మిట్లు అని హడావుడి చేస్తున్నారని విమర్శించారు. నాడు చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి కొన్ని వందల పరిశ్రమలు తీసుకువచ్చారని, వీటిలో సుమారు 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు, ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు ? అన్న విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంగటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్లోబల్ ఈవెంట్లతో వైజాగ్‌కు ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న శ్రీనుబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్లోబల్ ఈవెంట్లతో వైజాగ్‌కు ప్రత్యేక స్థానం దక్కుతుందని పల్సస్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఆరంభమవుతున్న సందర్భంగా ఆయన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మనదేశంలో వ్యాపారాలు విస్తరించాలని, తమ సంస్థలు స్థాపించాలని ఎదురు చూస్తున్న పెట్టుబడిదారులకు వైజాగ్‌లోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఒక అద్భుతమైన గమ్యస్థానమన్నారు. వైజాగ్‌లో దాదాపు 50 వేలకు పైగా ఐటి నిపుణులు, లక్షలాది మంది ఫార్మా, హెల్త్‌కేర్ నిపుణులు ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ టెక్ సమ్మిట్, ఇప్పుడు జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ వంటి గ్లోబల్ ఈవెంట్లతో రాబోయే రెండేళ్లలో 5 లక్షల మంది ఐటి, హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్ ప్రొఫెషనల్స్‌గా అందుబాటులోకి రానున్నారని తెలిపారు.

పెట్టుబడుల సదస్సుకు బడా పారిశ్రామిక వేత్తలు : ముత్తంశెట్టి

శుక్ర, శనివారాల్లో జరిగే పెట్టుబడుల సదస్సులో బిలియనీర్లు ముఖేష్ అంబానీ, కుమార్ మంగళం బిర్లా, సజ్జన్ జిందాల్, సంజీవ్ బజాజ్, కరణ్ అదానీ, టెస్లా ఇంక్ సహ వ్యవస్థాపకుడు మార్టిన్ ఎబర్‌హార్డ్ తదితర బడా పారిశ్రామిక వేత్తలు రానున్నారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

IN THE HON'BLE COURT OF II ADDL. SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
I.P. 7/2023

Between:
1. Gumpina Subba Rao
2. Gumpina Lakshmi ...Petitioners

And:
1. A. Simhachalam Naidu
2. Nakka Suryam
3. Chokkakula Nagesh
4. Allu Srinivasa Rao
5. Poosarla Mohan
6. Kalingi Raju ...Respondents

NOTICE TO CREDITORS DATE OF HEARING OF AN INSOLVENCY PETITION: 20-04-2023

Whereas (1) Gumpina Subba Rao and (2) Gumpina Lakshmi have applied to this Court by a petition dt:22-02-2023 to be declared an insolvent under the Provincial Insolvency Act, 1920. and your names appear in the list of creditors filed by the aforesaid debtors. This is to give you notice that the Court has fixed the day of **20-04-2023** for the hearing of the aforesaid petition and the examination of the debtors. If you desire to be represented in the matter, you should attend in person or by duly instructed pleader. The particulars of the debt alleged in the petition due to you are as follows:

S. No	Name and Particulars	Amount Rs.
01.	A.Simhachalam Naidu	6,00,000/-
02.	Nakka Suryam	9,00,000/-
03.	Chokkakula Nagesh	3,00,000/-
04.	Allu Srinivasa Rao	2,00,000/-
05.	Poosarla Mohan	30,000/-
06.	Kalingi Raju	30,000/-
	TOTAL	**20,60,000/-**

(By Order of the Honourable II Addl Senior Civil Judge, at Visakhapatnam)
YNS LAW CHAMBERS
Y. N. SRINIVAS & Y. SRI LAKSHMI,
Advocates, Visakhapatnam-16,
Cell: 9849664495.

మహిళల సంరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కలెక్టరేట్

రోజంతా సంరక్షణ, సౌకర్యాన్ని కోరుకునే మహిళలకు స్టే ఫ్రీ ఎక్స్‌ఎల్ సెక్యూర్ ఎంతగానో దోహదపడుతుందని జాన్సన్ అండ్ జాన్సన్ కన్స్యూమర్ హెల్త్ ఉపాధ్యక్షులు, మార్కెటింగ్ హెడ్ గ్యాడ్గిల్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేఫ్రీ సెక్యూర్ ఎక్స్‌ఎల్ మహిళలకు 12 గంటల వరకు సౌకర్యం అందించడంతోపాటు, దీర్ఘకాలిక రక్షణ అందిస్తుందన్నారు. బాలీవుడ్ ప్రముఖ నటి కియారా అద్వానీ స్టేఫ్రీకి బ్రాండ్ అంబాసిడర్ గా నియమితులు అయ్యారన్నారు. సమావేశంలో చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ రాహుల్ మ్యాత్యు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసనలు

ప్రజాశక్తి -యంత్రాంగం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా విశాఖ జిల్లా వ్యాప్తంగా గురువారం నిరసనలు హోరెత్తాయి. పలుచోట్ల కట్టెలతో వంట చేసిన నిరసన తెలిపారు.

తగరపువలస : సిపిఎం ఆధ్వర్యాన స్థానిక మార్కెట్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచిందన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.నాగరాజు, ఎస్.శ్రీనివాసవర్మ, కొత్తయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : తాటిచెట్లపాలెం జంక్షన్, ఎఎస్ఆర్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. గ్యాస్ బండని పక్కన పెట్టేసి కట్టెల పొయ్యితో వంట చేసుకునే రోజులు వచ్చాయని తెలుపుతూ వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కన్వీనర్ రాజు, నాయకులు కెఎస్.కుమార్, గౌరీష్ మాట్లాడుతూ, ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలపై మరో గుది బండ మాదిరిగా గ్యాస్ ధరలు పెంపు ఉందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రూ.400 ఉండే గ్యాస్ ధరను నేడు రూ.1111 కు పెంచిందని విమర్శించారు. చిల్లర వర్తకులు వాడే గ్యాస్ సిలిండర్‌పై ఏకంగా రూ.350.50 పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు ఆర్ఎన్ మాధవి, జ్యోతి, బి.లక్ష్మీపతి, కె.రమణమూర్తి, చిన్న, గంగ, ఆదిలక్ష్మి, సుందరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



అడ్డురోడ్డులో రాస్తారోకో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

యస్.రాయవరం:కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన అడ్డురోడ్డు కూడలిలో రాస్తారోకో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటికి రూ.400లు ఉన్న గ్యాస్ ప్రస్తుతం రూ.1200లకు చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

50 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం వద్ద ఆటోలో తరలిస్తున్న 50 కేజీలు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి ఏటగైరంపేట నుండి తాళ్ళపాలెం జంక్షన్ వైపు కాసారపు నాగరాజు ఆటో డ్రైవ్ చేసుకుంటూ వచ్చి కన్నూరుపాలెం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని డీకొట్లాడు. దీంతో స్థానికులు అక్కడకు చేరుకొని ఆటోని పరిశీలించారు. ఆటోలో గంజాయి ప్యాకెట్లు గుర్తుంచి ఎస్ఐ ఆదినారాయణ రెడ్డికి సమాచారం అందించారు. కాసారపు నాగరాజును, ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద నుండి సెల్ ఫోన్, 50 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సిఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతం యూనివర్సిటీకి నాక్ 'ఎ++' గ్రేడ్

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని విద్యా సంస్థల పనితీరును విశ్లేషించి వాటి స్థాయిని నిర్ణయించే నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి "ఎ++"గ్రేడ్‌ను ప్రకటించిందని గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలియజేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నాక్ గ్రేడింగ్‌లలో క్రమేపి ప్రగతిని సాధిస్తోందని 2011 సంవత్సరంలో ఎ గ్రేడ్, 2017లో ఎ+ గ్రేడ్‌ను సాధించిన గీతం ఇప్పుడు ఎ++ గ్రేడ్ సాధించడంలో అధ్యాపకులు, విద్యార్ధులు, పరిశోధకుల కృషి ఉందని ఆయన ప్రశంసించారు. నాక్ విశ్లేషనలో 4 పాయింట్లకు గాను ఈ ఏడాది 3.54 పాయింట్లు సాధించడంతో గీతం స్థాయి పెరిగిందన్నారు. దేశంలో నాక్ గుర్తింపు పొందిన దాదాపు 4201 విద్యాలయాలలో ఎ++ గ్రేడ్ సాధించినవి కేవలం 3 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. పరిశోధనలు, విశ్వవిద్యాలయ పరిపాలన, నూతన విద్యా విధానాలను అమలు చేయడం, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాది అవకాశాలను భవిష్యత్తులో మరింతగా ఉన్నతంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గీతం నాక్ ఎ++ గ్రేడ్ లభించడం పట్ల గీతం గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌లను ఆయన అభినంధించారు.

బాలికలు ఉన్నత స్థితికి చేరుకోవాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో గురువారం భేటీ బచావో.. భేటీ పడావో... కార్యక్రమం నిర్వహించారు. అందరూ బాగా చదువుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఎదగాలని, ఉన్నత శిఖరాలను అందుకోవాలని వైద్య ప్రతినిధులు ఆకాక్షించారు. వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సమత, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అఖిల, తాళ్లవలస పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ప్రిన్సిపల్ గంగా కుమారి పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కస్తూరిబా బాలికల వసతి గృహంలో భేటీ బచావో భేటీ పడావో..పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వి.సమత, ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.శైలజ మాట్లాడుతూ, గర్భిణులు ముందస్తుగా పుట్టే బిడ్డ ఆడ లేదా మగ అని తెలుసుకొనుటకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించుకొన్న వారికి జైలు శిక్షను విధిస్తారని చెప్పారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడ పిల్లలు అన్ని రంగాలలో ముందు ఉండేందుకు కృషి జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె కన్సల్టెంట్ హీనతీవారి, కెజిబివి ప్రిన్సిపల్ చంద్రకళ, హెల్త్ ఎడ్యుకేటర్ బేగం, ఎంఎల్‌హెచ్ పి.అరుణ, ఎఎన్ఎం దేవి తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన జిఇఎస్ సిఇఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక గొల్లలపాలెం కెజిబివిని ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో ఎన్‌సిఇఆర్‌టి సౌజన్యంతో నిర్వహిస్తున్న గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సిఇఒ రాకెల్‌శ్రాప్ గురువారం సందర్శించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. చలనశీలత, కెరీర్‌లో విజయం సాధించడం ఎలా? అనే అంశంపై ఆస్ట్రేలియా విద్యా సంస్థల్లో అమలవుతున్న బోధనా పద్ధతులను వివరించారు. కెజిబివిలోని 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడి, చర్చించారు. టెన్త్ పూర్తయ్యాక ఎలాంటి విద్యను అభ్యసించా లి? ప్రస్తుతం ఏ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉ న్నాయి? ఎలాంటి విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిసిడిఒ కాలేషా బేగం, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మి, న్యాయవాది హైందవి, ప్రిన్సిపల్ గంగా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం రాకతో టివి.కృష్ణంరాజు హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి-సింహాచలం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ వస్తున్న సందర్భంగా సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజును గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి గోపాలపట్నం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతరు

ప్రజాశక్తి- పద్మనాభం : పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలను అధికార పార్టీ బేఖాతరు చేస్తోందని పద్మనాభం మండల తెలుగుదేశం పార్టీకి చెందిన జడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు ఆరోపించారు. అధికారం అడ్డుపెట్టుకొని పాఠశాలల్లో ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పద్మనాభంలోని ప్రయివేటు పాఠశాలలో స్థానిక ఎంఇఒ సహకారంతో ఉపాధ్యాయులకు తప్పుడు మెసేజ్ పెట్టి సమావేశానికి రప్పించారని ఆరోపించారు. హాజరైన ఉపాధ్యాయులు, సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి పూర్తిగా మద్దతు ఇవ్వాలని ప్రచారం చేశారని, ఇది ఎన్నికల నిబంధనలకు పూర్తిగా విరుద్ధం అని పేర్కొన్నారు. అన్ని మండలాల్లో ఇలా చేస్తున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. టిడిపి తరుపున కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం అని చెప్పారు.

ఎండాడ పాఠశాల విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వం పాఠశాలలో 66వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలో ఎండాడ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల వ్యాయామం ఉపాధ్యాయుడు పి.నారాయణరావు తెలిపారు. ఈ పోటీల్లో ఎండాడ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జె.జశ్వంత్, ఎస్.రాజేష్ అండర్ 14 కేటగిరిలో పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరు త్వరలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనబోతున్నారని ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

దేశ ప్రగతిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం

ప్రజాశక్తి-మధురవాడ : దేశ ప్రగతిలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పాత్ర కీలకం అని, దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు పూర్తి స్థాయిలో లభించాలంటే ఏటా స్టార్టప్ కంపెనీల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందని ప్రముఖ ఐటి రంగ నిపుణుడు, సెయింట్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ బివి.మోహనరావు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు రెండు, మూడు రోజులలో అనుమతులు లభించే దశకు ప్రస్తుతం చేరుకున్నామన్నారు. యువత ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారాలంటే సమాజ అవసరాలను గుర్తించడం, మార్కెట్ అధ్యయనం, ఒకే ఆలోచనతో ఉండే వ్యక్తులతో టీమ్‌ను నిర్మించుకోవడం, నిధుల సమీకరణ, సవాళ్ళను ఎదుర్కొనే సమర్థత, ఒడిదుడుకులను తట్టుకుని నిలిచే స్వభావం ఉండాలని చెప్పారు. ప్రపంచం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి టెక్నాలజీ రంగం వైపు మారుతోందని తెలిపారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, యువతలో బాధ్యతరాహిత్యం, మొబైల్ ఫోన్‌ల ప్రభావం నుంచి బయట పడకపోవడం వారి ఎదుగుదలకు అవరోధంగా నిలుస్తోందన్నారు. పట్టణీకరణ వల్ల సూక్ష్మ కుటుంబాలు పెరిగి నేటి యువతరానికి మార్గదర్శకం చేసే పెద్ద తరం దూరమవుతోందని పేర్కొన్నారు. సవాళ్ళను ఎదుర్కొనేతత్వం లేక పోవడం, వివిధ అంశాలపై ఏకాగ్రతతో పనిచేయలేకపోవడం ప్రస్తుత తరంలో ఆందోళన కలిగించే అంశాలన్నారు. వీటి నుంచి బయటకు వచ్చి జీవితంలో ఎదగాలంటే ప్రతి ఒక్కరు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం గీతం ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, వివిధ కళాశాల డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకర్లపై ముత్తంశెట్టి ఆగ్రహం

ఎమ్మెల్సీ ప్రచారంలో నాపై వ్యతిరేకంగా రాస్తే ఊరుకోను

సీసీ కెమెరాలు ఆఫ్ చేసి ప్రచారం చేసిన అధికార పార్టీ నాయకులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఎమ్మెల్సీ ప్రచారంలో ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి ప్రచారం చేస్తున్న వైసిపి భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాజాగా గురువారం విలేకర్లపై విరుచుకుపడ్డారు. జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న మాలతాంబ విద్యానికేతన్‌లో వైసిపి అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులకు కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమం అనంతరం ఇటీవల కాలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల పని వేళలో ఉపాధ్యాయులను సమావేశపరిచి ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రచారం చేస్తున్నారని పలు పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆయన ఒక్కసారిగా అక్కడున్న విలేకర్లపై మండిపడ్డారు. "తాను ప్రచారం చేస్తే తప్పు, టిడిపి నాయకుడు కోరాడ రాజబాబు చేస్తే తప్పు కాదా అని ప్రశ్నించారు. నేను ఏమిటో తెలుసుకొని రాయు.... నా గురించి రాయడానికి ఏం హక్కు ఉంది' అంటూ విరుచుకుపడ్డారు. నువ్వేదో గొప్ప అనుకుంటున్నావా... నువ్వు విలేకరివి అయితే నాకు ఏమిటి.. ఏమి పీకుతావో పీక్కో.... నువ్వు నన్ను ఏమీ చెయ్యలేవు.... రేపటి నుంచి పార్టీ కండువా వేసుకొని తిరుగు.. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే ఊరుకోను...." అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పాఠశాలకు ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే వస్తున్నారని యాజమాన్యం సిసి కెమెరాలను నిలిపివేసింది. ఈ సమయంలో స్కూల్ సమీపంలో ఏదైన సంఘటన జరిగితే సిసి కెమెరాలే ప్రధాన సాక్ష్యంగా నిలుస్తాయన్న కనీస ఆలోచన లేకుండా అధికార పార్టీకి కొమ్ముకాయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

ముత్తంశెట్టి వ్యాఖ్యలు తగవు : సిపిఐ

పాత్రికేయులను నోటికి వచ్చినట్లు దూషించడం, బూతులు మాట్లాడడం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థాయికి తగనిపని అని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా స్థాయి దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డిఆర్‌ఎం అనూప్‌సత్పతి

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను డిఆర్‌ఎం అనూప్‌సత్పతి గురువారం తనిఖీ చేశారు. వెయిటింగ్ హాళ్లు, రైల్వే కార్యాలయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లాడుతూ, ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు స్టేషన్‌లో వైడ్‌ఫుట్ ఓవర్ బ్రిడ్జి వస్తోందని, స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేశామని, ఈ నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులో వస్తుందని తెలిపారు. ఆర్‌పిఎఫ్ నూతన భవనం దాదాపు పూర్తయిందన్నారు. అమృత్ భారత్ విధానంలో దువ్వాడ స్టేషన్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆయన వెంట ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్‌గుప్తా, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (గతిశక్తి) టిఎం.రావు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (సౌత్) ఓంప్రకాష్ మీనా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ప్రీతి రాణా, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సిహెచ్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

14న వికలాంగులకు ఉపకరణాల అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అగర్వాల్ మహాసభ ఆధ్వర్యాన విభిన్న ప్రతిభావంతులకు ఈ నెల 14న మహారాణిపేట రాజస్థానీ సాంస్కృతిక మండలి భవనంలో వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్ తదితరాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సంఘ అధ్యక్షుడు బిజేందర్‌కుమార్ గుప్తా తెలిపారు. రాజస్థానీ సాంస్కృతిక మండలిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యులు సర్టిఫికేషన్ చేసిన అర్హత గల లబ్ధిదారులకు 30 వీల్ చైర్లు, వంద వాకర్స్, 200 వాకింగ్ స్టిక్స్ ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సుమారు రూ.అయిదున్నర లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంజయ్ అగర్వాల్ (92466 20123)కు వికలాంగులు ఫోన్ చేసి ఈ నెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతోపాటు వికలాంగుని ఫొటో, ఆధార్ లేదా రేషన్ కార్డు జత చేయాలని తెలిపారు. వీల్‌చైర్ లబ్ధిదారులు దరఖాస్తుతో సహా 2023 జనవరి తరువాత ప్రభుత్వ వైద్యులు జారీచేసిన సర్టిఫికెట్ విధిగా జత చేయాలన్నారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన పరికరాలు ఉచిత పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యదర్శి నాగబోయిన నాగేశ్వరరావు, అగర్వాల్ మహాసభ విశాఖ విభాగం వైస్ ప్రెసిడెంట్ కనోడియా సంజయ్, కార్యదర్శి దేవకీనందన్ ఖేమ్కా, జాయింట్ సెక్రెటరీ రవిసింఘాల్, కోశాధికారి విష్ణు పచేరియా పాల్గొన్నారు.

ఎయులో 8న మహిళా దినోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆంధ్రవిశ్వకళాపరిషత్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. సమాజంలో స్త్రీ క్రింది స్థాయిదనే దురభిప్రాయం ఉందని, దీన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్త్రీలు అన్ని రంగాలలో సామాజిక ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందని, అందుకే తెలుగు విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చేయాలని సంకల్పించామని పేర్కొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : మండలంలోని దాకమర్రి పశు వైద్య శాలలో 90 పశువులకు డాక్టర్ ఆర్.శ్రీనివాసు గాలి కుంటు వ్యాధి నివారణకు గురువారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల్లో అధిక జ్వరం, పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద కురుపులు, బొబ్బలు కనబడతాయని, నోటి ద్వారా విపరీతంగా నురగ కారడం, చూడి పశువులకు అబార్షన్ అవ్వడం వ్యాధి లక్షణాలని వివరించారు. వెటర్నరీ అసిస్టెంట్ సరస్వతి, గోపాల మిత్ర రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 22 మంది ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 22 మంది అవంతి ఫార్మసీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎంబివి.రాజు తెలిపారు. మెడిఆసిస్ట్ టిపిఎ ఇండియా సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 60 మంది విద్యార్థులు హాజరవ్వగా, 22 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ రాజు, వైస్ ప్రిన్సిపల్ వి.ఉమాశంకర్, ఎఒ ఎం.సంతోష్ కుమార్ అభినందించారు.

ఎస్‌బిసి బ్రిడ్జిపై వాహనాలు అనుమతించాలి

6న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : ఎస్‌బిసి బ్రిడ్జి పై నుంచి ప్రజావాహనాలను అనుమతించాలని కోరుతూ మల్కాపురం బస్ స్టాప్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ, డాక్ యార్డు బ్రిడ్జి మరమత్తుల కోసం వాహనాల రాకపోకలను 15నెలల పాటు ఆపివేయడానికి నిర్ణయించారని, అంతవరకు పక్కనే ఉన్న ఎస్‌బిసి బ్రిడ్జి పై నుంచి ప్రజా వాహనాల రాకపోకలకు నేవల్ అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించినట్లు తెలిపారు. అయినా ఇంతవరకూ ఎవరూ స్పందించలేదన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు వాహనాల రాకపోకలు బంద్ చేస్తామని పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతున్నారని, దీనిపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గాజువాక నుంచి సింధియా వరకు 2లక్షల మంది నివసిస్తున్నారని, వేలాది ఉద్యోగులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు కెజిహెచ్‌కు, ఇతర ప్రయివేట్ ఆసుపత్రులకు, కోర్టులకు సకాలంలో చేరుకోవాలంటే ఇదే రహదానిని వినియోగిస్తున్నారని తెలిపారు. దీన్ని మూసివేయడం వల్ల ఇప్పుడున్న బస్సు మార్గం గుండా ప్రయాణిస్తే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. ఆ రహదారిలో ప్రమాదాలకు అవకాశముందని వివరించారు. నేవీ అధికారులను ఒప్పించి ఎస్‌బిసి బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించేలా చూడాలని కోరారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, డాక్‌యార్డు బ్రిడ్జి రాకపోకలు ఆపకముందే ప్రభుత్వ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సిపిఎం చేస్తున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఎల్.కృష్ణ, వాసు, ఏసుబాబు, ఆర్.అప్పన్న, రాజేష్, హరి, మహేంద్ర, రామకృష్ణ, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి



76వ వార్డు కమ్యూనిటీ హాల్ వద్ద సమావేశమైన జెఎసి ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లోని డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని 16 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రామచంద్రనగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం వార్డు స్థాయి నాయకులతో కమిటీ ఏర్పాటు చేశారు. 16 గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులుగా జాయింట్ యాక్షన్ కమిటీ వేశారు. సలహాదారులుగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, రంబ నారాయణమూర్తి, మంత్రి శంకర్ నారాయణ, మమ్మన మురళి, ఎం.రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా బలగ రామారావు, డి.రమణ, నాయుడు, రాజారావు, ఎంకెఎస్.మూర్తి, వి.నాగేశ్వరరావు, పి.సతీష్, టివై.దాసు, శ్రీకాంత్, సన్నీ, అప్పలరాజు, రామినాయుడు, ఖాతా బాలకృష్ణ, టి.సత్యనారాయణ, పివిటి.రమణ, టి.నాగేశ్వరరావు, పి.భాస్కరరావు, ఇ.సోములు, కె.వెంకటరావు, వి.కోటయ్య, పి.అప్పన్న, దాసరి రమణ, లక్ష్మి నియమితులయ్యారు.

ముఖ్యమంత్రికి కెకె.రాజు స్వాగతం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం, శనివారం నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు తన శ్రేణులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనుక్, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలి, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజినిఈశ్వరరావు, కెవిఎన్.శశికళ, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కెవి.బాబా, మాజీ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి కాకాణి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పనను వ్యవసాయ శాఖ సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. దేవస్థానం అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. 'బాల్యంలో పెళ్లిళ్ల–భావితరాలకు ఉరితాళ్ళు' అన్న నినాదంతో వార్డులోని గిరిజా కాలనీ సామాజిక భవనంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహపాత్రుడు మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు వల్ల బాలికలకు చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల తల్లితండ్రులు చట్టాలపై అవగాహన కల్పించుకొని బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఎల్.నిఖిల, కమ్యూనిటీ మొబలైజర్ వై.ధనలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీ ఆనంద్, వార్డు వైసిపి ప్రధాన కార్యదర్శి పెద్దింటి మంగు నాయుడు, సింగంపల్లి దేముడు, పెంద్ర రాజు, వాడపల్లి ప్రవీణ్, జాన సతీష్, సతీష్, వాలంటీర్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు తదితరులు

పాఠశాలను సందర్శించిన డైట్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పిఎస్‌ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలను డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు గురువారం సందర్శించారు. టెన్త్ విద్యార్థుల ఒకటో ప్రిపరేటరీ టెస్ట్ మార్కుల వివరాలను ఉపాధ్యాయులనడిగి తెలుసుకున్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. టెన్త్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.350 పెంచడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెంచిన ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో ప్రజలు సతమతమవుతుంటే మోడీ ప్రభుత్వం రోజురోజుకు పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యుని నడ్డి విరుస్తోందని విమర్శించారు. పెంచిన ధరను రాయితీ రూపంలో ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రెండేళ్లుగా గ్యాస్ రాయితీలను నిలిపివేసిందని తెలిపారు. గృహ వినియోగదారులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కుదించిందన్నారు. కమర్షియల్ సిలిండర్ ధర పెంచడంతో చిరు వ్యాపారులపై దీని ప్రభావం పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ధరల పెంపు పేదల, మధ్య తరగతి ప్రజలపై ప్రభుత్వాల దాడిగా ఆయన అభివర్ణించారు. బిజెపి ప్రభుత్వం 2014 ఎన్నికలకు ముందు గ్యాస్, పెట్రోల్ ధరలపై అరచి గీపెట్టిందని, తాము అధికారులకు వస్తే వాటి ధరలు తగ్గిస్తామని చెప్పి నేడు భారీగా పెంచడం దారుణమన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకొని, రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గం : సిపిఐ

వంట గ్యాస్ ధర రూ.50, కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.350 పెంచడం దుర్మార్గమని సిపిఐ అనకాపల్లి జోన్ కార్యదర్శి వైఎన్ భద్రం గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలను పెంచడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర చర్చా వేదిక నిరసన

అనకాపల్లి : వంట గ్యాస్ ధర పెంపుదలను నిరసిస్తూ ఉత్తరాంధ్ర చర్చ వేదిక ఆధ్వర్యాన స్థానిక గవరపాలెంలోని సంస్థ కార్యాలయం వద్ద కట్టెలపై వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు బుద్ధ రాజేష్ మాట్లాడుతూ 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.450 ఉన్న వంటగ్యాస్ ధర ఈ 9 ఏళ్ల కాలంలో రూ.1150 పెరిగిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ పేదల రక్తాన్ని పీలుస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పెంచిన 50 రూపాయల గ్యాస్ ధరను పేద ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కట్టెల పొయ్యి పెట్టి నిరసన తెలుపుతున్న దృశ్యం



మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ, చిత్రంలో తహశీల్దారు రమేష్‌బాబు

నెలాఖరుకు రెండో విడత రీ సర్వే పూర్తి

- అనకాపల్లి ఆర్‌డిఒ చిన్ని కృష్ణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో మలివిడతగా మరో 125 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎజి.చిన్నికృష్ణ చెప్పారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ రెండో విడత రీసర్వే ఈ నెలాఖరు నాటికి పూర్తి కాగలదని చెప్పారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో తొలి విడతగా 92 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందని తెలిపారు. గ్రామ సభలకు రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. రైతులు, వారి ప్రతినిధులు రికార్డులతో క్షేత్ర స్థాయిలో సర్వే బృందాన్ని నేరుగా కలవాలన్నారు. సర్వేలో రైతు రికార్డుల్లో తప్పులు ఉండకూడదని తెలిపారు. రీ సర్వే ప్రక్రియలో 9(2)నోటీస్ చాలా కీలకమైందని, అలాగే 10(1), నోటీస్ అభ్యంతరాలను స్వీకరించేందుకు, అనంతరం10(2) నోటీస్ ఫైనల్‌గా ఇచ్చి ఆర్డర్స్ జారీ చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్ బాబు పాల్గొన్నారు.



తయారు చేసిన ప్రాజెక్టుతో విద్యార్థులు

బ్యాటరీ ఛార్జింగ్ ప్రాజెక్టును రూపొందించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీ నాలుగో సంవత్సరం విద్యార్థులు బొద్దపు కుమార్, ఎన్నెటి శ్రీలక్ష్మి, కొటకల తులసి, కాజులూరి తులసి ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ చార్జింగ్ ప్రాజెక్టును ప్రాజెక్ట్ గైడ్ షేక్ సబీనా, ప్రాజెక్టు ఇంజనీర్ మామిడిపాటి శేషగిరిరావు పర్యవేక్షణలో రూపొందించారు. ప్రస్తుత కాలంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర, 4 చక్రాల వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇంటిదగ్గర పెట్టుకున్న చార్జింగోతో ఎక్కువ దూరం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వాహనాలు నడుస్తున్న సమయంలోనే ఎలక్ట్రో మాగ్నెటిక్ విధానం వలన వాహనం వెళ్తున్నప్పుడే ఆటోమేటిక్‌గా రీఛార్జ్ అవుతుంది. ఈ ప్రాజెక్టును తయారు చేసిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం, హెచ్‌ఓడి డాక్టర్ పూర్ణ ప్రియ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు అభినందించారు.

తాగునీటి బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి, చిన్నయ్యపాలెం గ్రామాల్లో నూతనంగా రెండు తాగునీటి బోర్లను గురువారం సిఎల్సి చర్చ్ అధినేత ఆల్బర్ట్ మహంతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వైసీపీ అధ్యక్షులు అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చంనాయుడు, దాకారపు నాగరాజు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు తదితరులు మాట్లాడుతూ ప్రజల త్రాగునీటి అవసరాలను తీర్చడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, ఎంపీటీసీ రాము తదితరులు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యార్థికి మొదటి గురువు తల్లిదండ్రులే


- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ
- ఘనంగా సూర్య బాసర పాఠశాల 6వ వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు

విద్యార్థులకు మొదటి గురువు తల్లిదండ్రులని, రెండో గురువు ఉపాధ్యాయులు అని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సూర్య బాసర స్కూల్ 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధత కలిగి ఉండటం వలన ఉన్నత స్థాయికి వెళ్లగలుగుతారని సూచించారు. విద్యార్థులను పూర్తిగా మార్చేది స్కూల్ అని, అటువంటి తరహాకి చెందినది సూర్య బాసర స్కూల్ అని కొనియాడారు. ప్రతి విద్యార్థి మూడు నియమాలను గుర్తించి విద్యను అభ్యసించడం వల్ల ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. మొదటిది తల్లిదండ్రులు తను భుజం తట్టే విధంగా ఉండాలని, రెండవది తను చదివిన స్కూల్‌కే ముఖ్యఅతిథిగా రావాలని, మూడవది తన సంతకం ఒక ఆటోగ్రాఫీగా ఉండే విధంగా ప్రతి విద్యార్థి ఆలోచన ఆచరణ కలిగి ఉండాలని సూచించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించినట్లయితే బావి భారత పౌరులుగా తయారవుతారని తెలిపారు. ప్రతిరోజు తమ పిల్లలతో తల్లిదండ్రులు సమయం కేటాయించి మహోన్నత వ్యక్తుల జీవిత చరిత్రను, ఆశలను పిల్లలకు తెలియజేయాలన్నారు. కార్పొరేట్ స్కూలుకు దీటుగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న సూర్య బాసర స్కూలు పిల్లలకు విద్యను అందించడం ఆనందదాయకమన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య బాసర స్కూల్ డైరెక్టర్ ఎస్టి నాయుడు, ఆర్ఎస్ఎన్ మూర్తి, స్కూలు ప్రిన్సిపల్ తేజ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రహదారి భద్రత దష్ట్యా అన్ని రకాల వాహనాల యజమానులు రవాణా శాఖ అందించే సూచనలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం వీర్రాజు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. aprtacitizenepragathi.org వెబ్ సైట్ ద్వారా హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. వాహనాల వెనుక భాగంలో రిఫ్లెక్టివ్ టేపును తప్పనిసరిగా అమర్చుకోవాలని, లేకుంటే మోటార్ వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి వీర్రాజు

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల కేంద్రంలోని రామాలయం వద్ద గురువారం సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వారికి చీరలు, తాంబూలాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి రీజనల్ కోఆర్డినేటర్ కసిరెడ్డి అప్పలనాయుడు, మండల కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు, సమితి సభ్యులు కన్నూరు సూర్యనారాయణ, ఇమ్మంది సన్యాసిరావుపాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మి తీర్థం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శ్రీకనక మహాలక్ష్మి ఆలయం వద్ద శుక్రవారం తీర్థం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు చైర్మన్ గొల్లివిల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగుతుందని, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని శ్రీనివాసరావు కోరారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఆడారు తులసీరావు విద్యకు ఎంతో ప్రాధాన్యతనిచ్చే వారిని, పాడి రైతుల పిల్లలు విద్యావంతులు కావాలని ఆయన ఆశయమని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రస్తుత చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొండ అచ్చయ్యదొర, సర్పంచులు మధు, తమరాన శ్రీనువాసరావు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న గేదెల సత్యనారాయణ తదితరులు



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

123వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -రాంబిల్లి : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనరసాపురం వద్ద నేవీ మెయిన్ గేట్ ముందు ఎన్ఎఒబి 8 గ్రామాల నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 123వ రోజుకు చేరింది. నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. 8 గ్రామాలు చెందిన నిర్వాసితులు 123 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తక్షణమే జెట్టీ నిర్మాణం చేయాలని, అన్ని గ్రామాలకు ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి పెద్దలు పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదుకు తుది గడువు 4

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతులు పంట వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రం పొందడానికి ఈకేవైసీ నమోదుకు ఈనెల 4 చివరి తేదీ అని, రైతులు గమనించి నమోదు చేసుకోవాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి తెలిపారు. ఈనెల 8 నుంచి 12 వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ, 13 నుంచి 17వ తేదీ వరకు ఫిర్యాదుల పరిష్కారం, ఈనెల 20న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని చెప్పారు. పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంట కొనుగోలు వంటి పథకాలకు రైతులు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ఆదేశించారు. మండలంలోని ఊడేరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, మండల ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కోరారు. చిన్నపిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, మండల ఇంజనీర్ కుమార్ రాజా, వైసిపి నాయకులు సకల సంతోష్, సచివాలయ పోలీస్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి నిధులు కోసం వినతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి చీపురుపల్లి తూర్పు ఖండం సర్వే నెంబరు 311/2లో రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి ఆ గ్రామ మాజీ సర్పంచ్, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు గురువారం వినతిపత్రం సమర్పించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో గురువారం మధురవాడలో సుబ్బారెడ్డిని ముత్యాలు కలిసి విన్నవించారు. దీనికి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించి టిటిడి ఈఓకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ముత్యాలు తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించాని ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, సురాడ సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.


సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముత్యాలు తదితరులు

వాడీవేడిగా మండల పరిషత్తు సమావేశం

అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండల పరిషత్తు సమావేశం గురువారం వాడివేడిగా జరిగింది. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి కోన సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రధానంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. ముప్పవరం గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి నేటి వరకు పేమెంట్ చేయలేదని, మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు వ్యవసాయ అధికారిని నిలదీశారు. బిల్లు చెల్లించకుంటే త్వరలో కార్యాలయానికి తాళాలు వేస్తానని హెచ్చరించారు. ధాన్యం సేకరణలో రైతులకు సకాలంలో డబ్బులు జమ చేయడం లేదని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మార్టూరు వెళ్లే ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించాలని దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు కోరారు. మడుతూరులో దరఖాస్తు చేసుకున్న 25 మందికి ఇంటి స్థలాలు కేటాయించాలని ఎంపీటీసీ ఎస్ జువాలనాయుడు విజ్ఞప్తి చేశారు. దొప్పెర్ల పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాల గురించి సర్పంచుకు తెలియకుండా అధికారులు చేస్తున్నారని సర్పంచ్ కె చిన్నారావు నిలదీశారు. పంచాయతీ సెక్రెటరీ గ్రామానికి రావడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఇజెడ్ దిబ్బపాలెం కాలనీలో రహదారులపై అధిక బరువు గల లారీలు, భారీ వాహనాల రాకపోకలతో రహదారులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు తెలిపారు. సర్పంచులకు తెలియకుండా ఉపాధి హామీ పనులు చేస్తున్నారని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు ఏపీవో వెంకటేశ్వరరావును నిలదీశారు. మడుతూరులో ఉపాధి హామీ కింద చెరువు గట్టుపై 300 కొబ్బరి మొక్కలు నాటి నీరు పోసేవారికి డబ్బులు ఇవ్వడం లేదని సర్పంచ్ ఎం సంజీవ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పి కోఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, ఎంపీడీవో వై విజయలక్ష్మి, తహశీల్దారు వై శ్రీనివాసరావు మండల పరిషత్ పరిపాలన అధికారి డి.కృష్ణ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోద్దేపు గోవింద్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే ముందు గ్రామ సర్పంచ్‌కు తెలియపరచాలని ఎలక్ట్రికల్ ఏఈని కోరారు. వెలుగు సిబ్బంది స్త్రీ నిధి పథకం ద్వారా మహిళలకు రుణా వాయిదాలు సంబంధించి 23 నెలల కట్టాలని మొదట చెప్పాగా, ఇప్పుడు 24 నెలలు వాయిదాలు కట్టించుకున్నారని, ఒక నెల డబ్బు ఏమవుతుందని ప్రశ్నించారు. ఎంపీపీ బోద్దేపు గోవింద్ మాట్లాడుతూ ఎలమంచిలి పట్టణ పరిధిలో గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల నేరాలు పెరుగుతున్నాయని, ఏడాదిగా ఒక్క గంజాయి కేసు కూడా నమోదు కాలేదని ఎక్సైజ్ శాఖను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, ఎంపీటీసీ, శిలపర శెట్టి ఉమా, ఎంపీడీవో దేవి ప్రసాద్, డిటీ, సుబ్రమణ్యం, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.






అచ్యుతాపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సంధ్య, యలమంచిలి సమావేశంలో పాల్గొన్న ఎంపిపి తదితరులు

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - వడ్డాది

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి 150వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 3 నుండి 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, కార్య నిర్వహణ అధికారి తెలిపారు. గురువారం రాత్రి స్వామి వారి దొంగ పెళ్లితో ప్రారంభమై 7న పుష్పాంజలతో ఈ వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు క్యూ లైన్లు, వైద్య శిబిరం, తాగునీటి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కొండవద్ద, వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలోనూ ఉత్సవాలు జరిగే రోజుల్లో సాంస్కృతి ప్రదర్శనలు, భక్తులకు మెట్ల దిగువన, గొల్లవీధి రోడ్డులోనూ ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని కొత్తకోట సిఐ సయ్యద్ అలియాస్ మహమ్మద్ బుచ్చయ్య పేట ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

ఈ ఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. 151 సంవత్సరల క్రితం విజయరామరాజుపేట కాళ్ళ వంశస్థులు భావిని తవ్వుతుండగా వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి విగ్రహాలు బయటపడ్డాయి. దీంతో అప్పటి గ్రామ పెద్ద దొండా భగవంతులయ్య ఈ విగ్రహాలను వడ్డాది గిరిజాంపగిరికి తెప్పించి దేవాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట చేయించారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా స్వామికి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల మాగాణి విరాళంగా ఇచ్చారు. 1970లో ఈ ఆలయం దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్ళింది. ఈ స్థలానికి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉన్నట్టుగా సింహాచలం దేవస్థానం ప్రచురణల్లో ఉంది. పాండవులు అజ్ఞాతవాసంలో విరాటరాజు పాలించిన మృత్య దేశ రాజధాని విరాటపురమే నేటి వడ్డాది అని పూర్వికులు చెబుతుంటారు. పాండవులు గిరిజాంబగిరిని ఆనుకుని ఉన్న చెరువులలో స్నానమాచరించి సంధ్యావందనం చేసేవారని, కనుకనే ఈ చెరువును పాండవుల చెరువుగా పిలుస్తున్నారని అంటున్నారు.





మాన్య సంఘవి, సేహా అక్షయ

నేహా, మాన్యకు విశిష్ట వనిత పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బహుభాషా నృత్య విభాగాల్లో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన అనకాపల్లి జిల్లాకు చెందిన మాన్య సంఘవి, నేహా అక్షయకు విశిష్ట వనిత పురస్కారాలను అందజేయనున్నట్టు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం నిర్వాహకురాలు బికె.రామేశ్వరి తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ వీరు న్యూఢిల్లీ రిపబ్లిక్ దినోత్సవంలో ప్రధాని ఎదుట బంద నృత్యంలో పాల్గొన్నారని, ఇండోనేషియా, సింగపూర్ ఇంటర్నేషనల్ కల్చరల్ ఎక్స్చేంజి ప్రోగ్రాంలో ఇండియా తరపున పాల్గొన్నారని తెలిపారు. విశాఖ స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కు చెందిన ఈ విద్యార్థులు థాయిలాండ్ ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్టివల్, న్యూఢిల్లీ కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల జరిగిన జాతీయ గిరిజన నృత్యోత్సవాల్లో పాల్గొని అనకాపల్లి జిల్లాకు మంచి పేరు తెచ్చారని తెలిపారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు సూర్య ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఆల్ ఇండియా కబడ్డీ పోటీలకు మండలంలో భోగాపురం గ్రామానికి చెందిన అడగర్ల సూర్య ఎంపికయ్యారు. ఈనెల 3, 4, 5 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా కబడ్డీ మీట్‌కు సూర్య హాజరవుతున్నారు. సూర్య ఎంపిక పట్ల ఏపీఎస్ఆర్టీసీ ఎండి అభినందనలు తెలిపారు. సూర్య ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ గాజువాక డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు.

నూకాంబిక పంచలోహ విగ్రహానికి విశిష్ట పూజలు

ప్రజాశక్తి -అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం శ్రీకంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో 300 కేజీల అమ్మవారి పంచలోహ విగ్రహానికి విశిష్ట పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ శిల్పి కామధేను ప్రసాద్ రూపొందించిన ఈ విగ్రహానికి ప్రధమ పూజ చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో గోపూజ నిర్వహించారు. వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, యువ నాయకులు దాడి జయవీర్, నూకాంబిక ఆలయ ఈవో చంద్రశేఖర్, కన్యక పరమేశ్వరి ఆలయ అధ్యక్ష కార్యదర్శులు బిల్లపాటి కృష్ణ కుమార్, కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి అచ్యుతాపురం : క్రీడలలో రాణించిన వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ చెప్పారు. మార్టూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు గురువారం ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పండగ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేకమైన పూజలు చేశారు. ఈ పోటీల్లో మార్టూరు జట్టుకు ప్రథమ స్థానం, పెద్ద కలవలపల్లి టీంకు ద్వితీయ స్థానం, కొత్తపట్నం జట్టుకు తృతీయ స్థానం సాధించారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన కెవిఆర్ యూత్ ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. గ్రామ సర్పంచ్ కేకే రమేష్ బాబు, గ్రామం నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ కేకే శ్రీనుబాబు, కార్యదర్శి కె.వి రమణ, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిఐఎస్‌తో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మేట్ వల్ల రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వస్తాయని, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని దేవరాపల్లి మండల సచివాలయాల ఇన్‌ఛార్జి కెవి రమణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మానవ మానవ వనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు.

డూప్ కేలండర్‌గా మార్చిన జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రతి ఏటా జనవరిలో జాబు కేలండర్ విడుదల చేస్తామని చెప్పి దానిని డూప్ కేలండర్‌గా మార్చాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. గవరపాలెంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా నిరుద్యోగులను, విద్యార్థులను జగన్‌రెడ్డి మోసగిస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. ఈ కాలంలో ఒక డీఎస్సీ కూడా ప్రకటించలేదన్నారు. నిరుద్యోగ యువత లక్షల రూపాయలు కోచింగ్ సెంటర్లకు కట్టి శిక్షణ పొందుతున్నారని, జాబు కేలండర్ ప్రకటించకుండా వారి జీవితాలతో జగన్ రెడ్డి ఆటలాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలను కూడా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రతినెల ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్ సొమ్మును జగన్ రెడ్డి దారి మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బుద్ధ కాశి విశ్వేశ్వరరావు, జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, కొణతాల కారు బాబు, సాలాపు నాయుడు, శిలపరశెట్టి భాస్కర్ రావు, వానపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నీటి కోసం వేచివున్న విద్యార్థినులు

విద్యార్థినుల అవస్థలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీలోని గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు తాగునీటి కోసం అవస్థలు పడ్డారు. ఈ హై స్కూల్లో సుమారు 600 మంది చదువుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో గురువారం హైస్కూల్లో మంచినీరు లేక విద్యార్థులు రోడ్డున పడ్డారు. మధ్యాహ్నం భోజనం అనంతరం హైస్కూల్లో నీరు లేకపోవడంతో పోలీస్ స్టేషన్ వెనుక గల రామకోవెల వద్ద బోరు బావి వద్దకు వంద లాది మంది విద్యార్థినిలు క్యూ కట్టి మంచినీరు కోసం అవస్థలు పడ్డారు. భోజనం కంచాలు కడుక్కోవడానికి నీరు లేక రోడ్డు మీదకు వచ్చామని విద్యార్థినిలు ఆవేదన చెందారు.



ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

ఆడ పిల్లల రక్షణకు ర్యాలీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: ఆడపిల్లలను కాపా డండి" రక్షించాలని మండలంలో సర్వసిద్ధి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్థానిక యుపి స్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్త్ విజిటర్ సి.హెచ్.రమణ మాట్లాడుతూ, గర్భిణీలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించు కోరాదన్నారు. ఇది చట్ట రీత్యా నేరమన్నారు. ఆడ పిల్లలను విద్య, ఉద్యోగాలల్లో రాణించేలా తీర్చిదిద్దాలని అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశామని ఆరోగ్య విస్తరణ అధికారులు టి.నాగేశ్వరరావు, బి .సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:గర్భిణీలు, బాలింతలు రక్తహీన తను అధిగమించడానికి తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలో లింగంపేట అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. కేంద్రంలో ఉన్న రికార్డులను ఆయన పరిశీలించారు. కేంద్రంలో గర్భిణీలు, బాలింతల వివరాలను కార్యకర్త సత్యవతిని అడిగి తెలుసుకున్నారు. వీరంతా రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం ఉమా, తదితరులు పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొంగసింగి జంక్షన్‌లో ఐదు లీటర్ల సారాను పట్టుకున్నామని కేడిపేట ఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు. సారాతో పాటు కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన లింగేటి గంగరాజును పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఉపమాక ఉత్సవాలకు శ్రీకారం

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు గురువారం ఉదయం శ్రీకారం చుట్టారు. పురవీధుల్లో పెండ్లి కావిడ ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యుల, అర్చకులు కృష్ణమాచార్యులు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెళ్లి కావిడి ఊరేగింపులో పలువురు భక్తులు పసుపు, కుంకుమ సమర్పించారు. ఆలయం వద్ద శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి ఎదురు నన్నాహ మహోత్సవం, రథోత్సవం జరుగుతుంది. అర్ధరాత్రి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కల్యాణవేదిక వద్ద అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. భక్తులకు సర్వ దర్శనం తో పాటు ,50 రూపాయలు టికెట్ దర్శనం కూడా ఏర్పాటు చేశారు. వెంకన్న కల్యాణోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసారు. ఇద్దరు సిఐలు రెండు స్పెషల్ పార్టీలు (30) మంది, ఎస్ఐలు, పిసీలు, సచివాలయ మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసారు.డిఎస్‌పి ప్రవీణ్ కుమార్, స్థానిక సీఐ నారాయణరావు పోలీసులకు పలు సూచనలు చేసారు. ఎస్ఐ శిరీష భక్తుల భద్రత, వాహనాలు రాకపోకలు, పార్కింగ్ ప్రదేశాలను పోలీసులకు వివరించారు.



ఊరేగిస్తున్న అర్చకులు

ముమ్మరంగా శానిటేషన్ పనులు

నక్కపల్లి:ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. భక్తులు స్నానాలు ఆచరించే పుష్కరిణి స్నాన ఘట్టాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లోనూ శానిటేషన్ చర్యలు చేపట్టారు. గురువారం ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ శానిటేషన్ పనులను పరిశీలించారు.

పోలింగ్ బూత్‌ను ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక ఎంపీపీ పాఠశాలలో కేటాయించిన ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌ను గురువారం ఆర్డీవో హెచ్‌వి.జయరాం సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. 22ఎలో నమోదైన భూ వివరాలను తహశీల్దార్ ఆనందరావుతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న ఓటీసీ చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులకు ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న రెవెన్యూ సేవలను పెండింగ్ లేకుండా అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఏర్పాట్లను చూసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులకు తహశీల్దార్‌కు ఆయన ఆదేశించారు. ఓటింగ్ జరిగే భవనంలో సరైన వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు ఉండాలని, ఓటర్లకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందరావు, పాఠశాల సిబ్బంది కోడి రాజబాబు పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌ను పరి పరిశీలిస్తున్న ఆర్డీవో

మధుకు ఘన సన్మానం



మధును సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ను 10వ తరగతికి అప్‌గ్రేడేషన్ చేసేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం అభినందించదగిన విషయమని మాజీ జెడ్పిటిసి చిట్ల చలపతి పేర్కొన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు, ఎం అప్పలరాజు దీనికి సంబంధించి గత నెలలో జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారన్నారు. దీనికి స్పందించిన అధికారులు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో 10వ తరగతి వరకు ఎస్సీ బాలురకు హాస్టల్ లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారన్నారు. మూడవ వార్డులో ఉన్న నెంబర్ టు హాస్టల్ ను 10వ తరగతి వరకూ విద్యార్థులు ఉండి చదువుకునేందుకు అధికారులు సూచనప్రాయంగా అంగీకరించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుకు స్థానిక కేఎన్‌ఆర్ లాడ్జిలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు యాదగిరి దాసు, నేతలు పాల్గొన్నారు.

చేపల వేటపై తీర్మానం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్‌లో సంఘ సభ్యులు మాత్రమే చేపల వేట సాగించాలని మత్స్యకార సంఘం తీర్మానించింది. రిజర్వాయర్‌లో చేపలు పట్టే విషయమై మత్స్యకార సొసైటీలో గురువారం వివాదం ఏర్పడింది. ఈ మేరకు గొలుగొండ ఎస్సై నారాయణరావు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఎంపిపి గజ్జలపు మణికుమారిల ఆధ్వర్యంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నక్కా రమణ ఆధ్వర్యంలో వివాదాన్ని పరిష్కరించారు. తాండవ మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీను, ప్రస్తుత అధ్యక్షుడు నక్కా రమణల మధ్య సయోధ్య కుదిర్చారు. ఇకపై సంఘ సభ్యులు మాత్రమే వేట కొనసాగించే విధంగా తీర్మానం చేసుకొని సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణతో పాటు రావణాపల్లి, పుత్తడిగైరంపేట, కొమిర తదితర పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు..



సమావేశమైన మత్స్యకారులు

వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గొంప భీమలింగేశ్వర స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన పైడిమాంబ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అందజేసిన వాటర్ ట్యాంక్‌ను గ్రామ సర్పంచ్ కంట్రెడ్డి గోవిందు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గొంప ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్నందుకు అభినందించారు. ఈ వాటర్ ట్యాంకుతో ఆలయానికి వచ్చిన భక్తులకు మంచినీటి సదుపాయం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అధికారి రాజు, అప్పలనాయుడు మాస్టారు పాల్గొన్నారు.



ట్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌ను కలిసి మీడియా డైరీని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లపై ఎమ్మెల్యేతో చర్చించారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు సిహెచ్‌ఐఎల్ స్వామి, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు చేరా చినబాబు (బాబీ), అప్పారావు, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నానాజీ, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎస్సిహెచ్.నాయుడు, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మద్దు రామకృష్ణ, ఏపీఈఎంజేఏ నర్సీపట్నం ఏరియా అధ్యక్షులు విజయ్, కార్యదర్శి శ్రీనివాస్‌వర్మ, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు అచ్చిరాజు పాల్గొన్నారు.



ఫర్నీచర్‌ను ఇస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట అంగన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్, గోడ గడియారం, 6 కుర్చీలు తదితర ఫర్నిచర్ సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు సొంత నిధులతో అంగన్వాడి టీచర్ గూడేపు వెంకటలక్ష్మి కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు కూర్చోవడానికి కుర్చీలు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కుమారి, బీరా పద్మ, ఎస్టీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు సమాల నాని, అంగన్వాడీ టీచర్ గూడెపు వెంకటలక్ష్మి, ఆయా సిహెచ్ నాగమణి పాల్గొన్నారు.

కబడ్డీ మీట్‌కు సూర్య ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ:గత నెల 16, 17 తేదీలలో విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా కబడ్డీ సెలక్షన్‌లో గొలుగొండ మండలం కేడిపేటకు చెందిన అడిగర్ల సూర్య ప్రతిభ చాటాడు. 15 రోజుల పాటు విజయవాడలో శిక్షణ తీసుకుని ఈ నెల 3, 4, 5 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా కబడ్డీ మీట్‌కు సూర్య హాజరు కానున్నారు. సూర్య ప్రస్తుతం గాజువాక ఆర్టీసి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసి డిఎం సూర్యను అభినందించారు. ఆర్టీసి సిబ్బంది, కుటుంబ సభ్యులు, అల్లూరి క్లబ్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



అభినందిస్తున్న డిఎం



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

ఎఎల్ పురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మన గ్రామాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత అన్నారు. గురువారం పంచాయతీ ప్రవేశ ముఖ ద్వారం రోడ్డుకు ఇరు వైపులా చెత్త పేరుకుపోయి వాహనదారులకు, వాకింగ్‌కి వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలగడాన్ని గమనించిన సర్పంచ్ దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపులా చెత్తను వేయవద్దని, దూరంగా ఉన్న డంపింగ్ యార్డు వద్ద చెత్తను వేయాలని కోరారు. చెట్లను రోడ్డుకు ఇరువైపులా వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చింతల బుల్లి ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సెక్రటరీ రాజేష్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు

-ఓటర్లకు పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్ధన- విస్తృతంగా ఎన్నికల ప్రచారం



అరకులో ప్రచారం చేపడుతున్న కోరెడ్ల రమాప్రభ

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి చేశారు. మన్యంలోని పలు మండలాల్లో ఆమె గురువారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. విశాఖలో పలు సంఘాల నేతలు ప్రచారం చేపట్టారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పాడేరు : పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం శాసనమండలి వేదికగా కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమని ఆమె తెలిపారు. గురువారం పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 250 సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. జిఒ 3 రద్దుతో విద్య, ఉద్యోగాల్లో ఏజెన్సీలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం, గిరిజన హక్కులపై దాడి, గిరిజనుల భూములు, సహజ వనరులపై పెత్తనం, గిరిజన ఆశ్రమాల్లో సిబ్బంది కొరత, హెల్త్‌వాలంటీర్ల తొలగింపు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే కాలయాపన వంటి చర్యలతో గిరిజనుల సంక్షేమం, మన్యప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయన్నారు. ఈసందర్భంగా పాడేరులోని పలు కార్యాలయాలు, పాఠశాలల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి స్వయంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, మెడికల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరీష్, స్థానిక గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందరరావు, బొజ్జన్న ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపిద్దాం

హుకుంపేట: ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపించాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘం, సిఐటియు నేతలు కోరారు. గురువారం మండలంలోని కస్తూర్బా, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆంగ్ల మాధ్యమ బాలురు బాలికల పాఠశాలల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. గిరిజన సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు, యుటిఎఫ్ జిల్లా నేత మహేష్, సిఐటియు మండల అధ్యక్షులు వి.లక్ష్మణరావు ,గిరిజన మహిళ సంఘం జిల్లా నేత ఎస్ హైమావతి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని యండపల్లివలస గురుకుల బాలికల కళాశాల, పాఠశాల, అరకులోయ బాలుర గురుకులాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. సిపిఎస్ రద్దు, జిఒ 3 పునరుద్ధరణ,గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక డిఎస్‌సి, భాషా, హెల్త్ వాలంటీర్ల రెన్యువల్, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, గిరిజన సంఘం మండల నాయకులు, రామారావు, భగత్ రామ్, ఐద్వా రాష్ట్ర నేత వివి.జయ పాల్గొన్నారు

రెండు బృందాలుగా గిరిజన సంఘం నేతల ప్రచారం

అనంతగిరి : ప్రజాసంఘాలు బలపరిచి, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, గిరిజన సంఘం నేత ఎం.కృష్ణ, సింగులు ఆధ్వర్యాన రెండు బృందాలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విస్తృత్తంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్. నాగులు, జె. సుబ్బారావు, కె మొస్య. కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదబయలు : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గిరిజనసంఘం ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం చేశారు. పాఠశాలలు, కార్యాలయాలతోపాటు ఉపాధి పనిప్రదేశంలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే అడుగులపుట్టు, సీతగుంట, లక్ష్మీపేట పంచాయతీల్లోనూ సచివాలయాలు, పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజనసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము పృథ్వీరాజ్, సంఘం పూర్వ అధ్యక్షుడు బోండా సన్నిబాబు, ఎస్ఎఫ్ఐ నేత జంపరంగి సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని లువ్వాసింగి, కోరాపల్లి పంచాయతీల్లోని కోరాపల్లి, తగ్గిమెట్ట అరగడపల్లి లువ్వాసింగి తియ్యగుండం తదితర గ్రామాలలో కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, సిఐటియు మండల కార్యదర్శి జె.దీనబంధు గిరిజన మహిళ సంఘం మండల కన్వీనర్ అరగడ శ్రీలత విస్తృత ప్రచారం చేశారు.

ముంచింగిపుట్టు: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ అభ్యర్థించారు. మండల కేంద్రంలో వైస్ఎంపిపి పాటుపోయి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గాసిరం దొర, లైకోన్ పాల్గొన్నారు.



భీమిలిలో చేపడుతున్న ప్రచారం

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి



కరపత్రాన్ని ఇస్తున్న సిహెచ్.నర్సింగరావు

ఉక్కునగరం : అగనంపూడి పరిసర ప్రాంతాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు ప్రచారం నిర్వహించారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. పట్టభద్రులంతా విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమ గురించి చట్టసభలలో సమర్థవంతంగా మాట్లాడగలిగే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నారాయణరావు, శశిరెడ్డి, ఫణీంద్ర, బిఎస్ఎన్.రాజు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ, వి.నాగరాజు గురువారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందజేసి మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి రమాప్రభను గెలిపించాలని కోరారు

గాజువాక : గాజువాక పరిధి శ్రీనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రమాప్రభకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే రమాప్రభ లాంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నాయకులు పేర్కొన్నారు.



విచారణ చేస్తున్న కొత్తకోట ఎస్ఐ

రోడ్డు ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం గంపవాని పాలెం గ్రామంలో రహదారి ఆక్రమణపై స్పందనలో వచ్చిన ఫిర్యాదు పై కొత్తకోట ఎస్సై విభూషణరావు, జడ్.బెన్నవరం వీఆర్వో దేవకాంత సంఘటనా స్థలంలో గురువారం విచారణ చేపట్టారు. తమ ఇళ్లకు రాకపోకలు సాగించే పంచాయతీ రహదారిని స్థానిక విఆర్‌పి రొంగలి ఉమా, ఆమె భర్త రమణ, మరో ఇద్దరు రొంగలి రాజబాబు, స్వామి తదితరులు ఆక్రమణ చేశారంటూ స్పందనలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు గ్రామానికి చెందిన మాకిరెడ్డి రమణ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ, విఆర్ఓ విచారణ చేపట్టారు. విచారణకు విఆర్‌పి కుటుంబ సభ్యులు హాజరు కాలేదని, రహదారి ఆక్రమణ జరిగిందని విచారణలో తేలిందని, వారి వద్ద పత్రాలు ఏమైనా ఉంటే చూపాలని నోటీస్ జారీ చేశామన్నారు. రెండు రోజుల్లో సరైన సమాధానం ఇవ్వకుంటే జిల్లా అధికారులకు సమస్య పై నివేదిక అందజేస్తామని విఆర్ఓ పేర్కొన్నారు.



నిరుపయోగంగా ఉన్న వామనం

నిలిచిన సంచార పశు వైద్య సేవలు

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ సంచార పశు వైద్య సేవలు గడిచిన వారం రోజులుగా మండలంలో నిలిచి పోయాయి. దీంతో ప్రభుత్వం మండలానికి ఏర్పాటు చేసిన పశు సంచార వాహనం వృథాగా దర్శనమిస్తోంది. ఈ విషయమై స్థానిక పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రప్పడును వివరణ కోరగా.. సంబంధిత వాహనానికి సంబంధించిన డ్రైవర్ విధులకు హాజరు కాకపోవడంతో పశువైద్య సేవలు తాత్కాలికంగా అందించలేక పోతున్నామన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, త్వరలో వాహన డ్రైవర్‌ను నియమించి వాహన సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న జగనన్న కాలనీ, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ అధికారి జగదీశ్వర్, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరు కరుణ, పిఆర్ ఇంజనీర్ వర్మ, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.



తొలగించని ఎమ్మెల్యే కటౌట్

ఎన్నికల కోడ్ అమలేదీ ?

- తొలగించని కటౌట్లు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో ముషిడిపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు కాలేదు. కోడ్ అమల్లో ఉన్నా వైసిపి నేతల ఫ్లెక్సీలు అలాగే దర్శనమిస్తున్నాయి. గడపగడపకు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అలాగే ఉండటం విశేషం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గత నెల 9వ తేదీ నుంచే అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఎన్నికల కోడ్ ముగిసే వరకూ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు, ఫ్లెక్సీలను తొలగించాలి. కానీ, స్థానిక ఎమ్మెల్యే గణేష్, వైసీపీ నాయకుల నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.

DONATE BLOOD SAVE LIFE
ప్రజాశక్తి
విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవ మరియు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా
బ్లడ్ డొనేషన్ క్యాంప్
తేది: 8-3-2023 బుధవారం
సమయం : ఉదయం 9 గంటలకు
స్థలం : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ,
జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా, విశాఖపట్నం.
స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ప్రాణదాతలుకండి!
పేర్లు నమోదు చేసుకునేందుకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
దేముడుబాబు : 9490099672
ఎస్.ఎస్.రవి : 9490099676
రాజ్‌కుమార్ : 8712900005